

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు


మంగళవారం

12 ఆగస్టు 2025 పేజీలు : 08




- మంత్రి నారాయణ
- 13 ఉన్నత పాఠశాలలను వచ్చే జూన్‌కు అన్ని రకాలుగా తీర్చిదిద్దుతాం
- పీ4 విధానంలో నగరంలోని 54 పాఠశాలల విడతల వారీగా అభివృద్ధి
- వీఆర్ పాఠశాలలో అధిక శాతం మంది పిల్లలు సర్వేపల్లి కాల్వకట్ట, పెన్నాకట్ట, జాఫర్‌నగర్ కట్ట, కుసుమ హరిజనవాడకు చెందినవారే

## ప్రభుత్వ స్కూల్స్ రూపురేఖలు మారుస్తాం



నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 విధానంలో నగరంలోని 54 పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం అయన నగరంలో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా మూలాపేట ఏనుగు సుందర రామిరెడ్డి నగరపాలక ఉన్నత పాఠశాల, జెండావీధిలోని పెంద్యాల నారాయ ణమ్మ నగరపాలక బాలికోన్నత పాఠశాల, సంతపేటలోని ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాల, రంగనాయకుల పేటలోని పిఎంఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల, జాకీర్‌హుస్సేన్ నగర్‌లోని నగరపాలక ఉన్నత పాఠశాల, శెట్టిగుంటలోని యడ్లపల్లి వెంకటేశ్వర్లు నగరపాలక ఉన్నత పాఠశాల, నవాపేటలోని బీవీఎస్ నగరపాలక బాలికల ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. ఎంత మంది పిల్లలు ఉన్నారు ? అదనపు గదుల నిర్మాణం కొరత ఎంత ఉంది ? అలాగే ఫ్లోరింగ్ ఏర్పాటు, మౌలి వసతుల కోసం ఏర్పాటుకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బివిఎస్ బాలికలు ఉన్నత పాఠశాల తనిఖీ చేసి మీడియాతో మాట్లాడారు. ఎన్‌సిసి గ్రూప్ సహకారంతో వీఆర్ పాఠశాలను అదునీకరించామని, అందులో ఎక్కువ శాతం అడ్మిషన్ పొందిన వాళ్ళు నిరుపేదలు, పేద కుటుంబాలకు చెందిన వారేనని తెలియజేశారు. ఎక్కువగా సర్వేపల్లి కాలువ కట్ట,

-మిగతా 2లో

అక్రమ మద్యం నిల్వలు కేసులో

## కాకాణికి బెయిల్



- ఇది రాజకీయ వేధింపుల కేసు : కాకాణి తరపు న్యాయవాదులు
- కాదు కాదు, ఇది అధికారంలో ఉన్నప్పుడు చేసిన అక్రమం : పబ్లిక్ ప్రాసిక్యూటర్
- ఇరువైపుల విన్న న్యాయమూర్తి బెయిల్ మంజూరు

నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :

ఇందుకూరుపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్తుకూరు మండలం పంటపాలెం గ్రామ సమీపంలో అక్రమంగా మద్యం నిల్వలు దాచి ఉంచారని నమోదైన కేసులో నిందితుడైన కాకాని గోవర్ధన్ రెడ్డికి బెయిల్ మంజూరు చేస్తూ నెల్లూరు 4వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నిషాద్ నాజ్ షేక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

-మిగతా 2లో



దేశంలో పీఎం ఇంటర్న్‌షిప్ పథకం

## అమలు స్థితి ఏమిటి?

నెల్లూరు, మేజర్‌న్యూస్ :

దేశంలో ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ అమలు స్థితి తెలియజేయాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోరారు. ఈ మేరకు లోక్‌సభలో పథకం అమలుపై పలు ప్రశ్నలు వేశారు. టాప్ 500 కంటే ఎక్కువ కంపెనీలు ఈ పథకంలో పాల్గొనడానికి ఆసక్తి చూపుతున్నాయనేది నిజమేనా.. అని ఆరా తీశారు. ఇందులో ఏమైనా సవరణలు ఉంటే తెలపాలన్నారు. ఈ విషయంలో సీఐఐ, ఎఫ్ఐసీసీఐ, ఇతర పరిశ్రమ సంస్థలు ప్రభుత్వానికి సహకరిస్తున్న అంశం తెలియజేయాలని కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం 2024-25 బడ్జెట్‌లో ప్రకటించబడిందని, ఐదు సంవత్సరాలలో టాప్ 500 కంపెనీలలో ఒక కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం దీని లక్ష్యమన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద సంవత్సరంలో యువతకు 1.25 లక్షల ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పైలట్ ప్రాజెక్ట్ కింద మొదటి రౌండ్‌లో భాగస్వామ్య కంపెనీలు దేశవ్యాప్తంగా పీఎంఐఎస్ పోర్టల్‌లో 1.27 లక్షలకుపైగా ఇంటర్న్‌షిప్ అవకాశాలను పోస్ట్ చేశాయన్నారు. దీనికి సుమారు 1.81 లక్షల మంది అభ్యర్థుల నుండి 6.21 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. భాగస్వామ్య కంపెనీలు 60 వేల మందికి పైగా 82 వేల కంటే ఎక్కువ ఇంటర్న్‌షిప్ ఆఫర్‌లను అందించాయని వివరించారు. అభ్యర్థులలో 28 వేల కంటే ఎక్కువ మంది అభ్యర్థులు ఇంటర్న్‌షిప్‌లో చేరడానికి ఆఫర్‌లను అంగీకరించారు, 8700 కంటే ఎక్కువ మంది అభ్యర్థులు వారి ఇంటర్న్‌షిప్‌లో

-మిగతా 2లో

# ఆన్‌వీల్స్- ఇంటి వద్దకే వైద్యం వాహనాలు

- నగరంలోని జండా వీధి వద్ద వైద్య శిబిరం ఏర్పాటు
- పట్టణానికే కాకుండా పల్లెలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుందన్న మంత్రి నారాయణ
- రూ.2 కోట్లతో విలువ గలిగిన వాహనాలను ప్రారంభించిన మంత్రి
- ప్రతిరోజు ఒక డివిజన్‌కు తిరగనున్న ఆన్ వీల్స్ వాహనం
- ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరిన మంత్రి







**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** నారాయణ హాస్పిటల్ ఆన్ వీల్స్ – ఇంటివద్దకే వైద్యం వాహనాలను రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సోమవారం ప్రారంభించారు. నగరంలోని జెండావీధి షాదీ మంజిల్ వద్ద మొబైల్ వైద్యశిబిరం నారాయణ హాస్పిటల్స్ వారు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి నారాయణ పాల్గొన్నారు. డివిజన్‌కు విచ్చేసిన మంత్రికి స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. పట్టణాలకే కాకుండా పల్లెలకి కూడా మెరుగైన వైద్యసేవలు అందించాలని నారాయణ హాస్పిటల్ సంకల్పించిందని, అందుకోసం రెండు కోట్లతో నారాయణ హెల్ప్ ఆన్ వీల్స్ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. ఆ వాహనంలో వైద్య సేవలు, పరీక్షలకు సంబంధించిన అన్ని సౌకర్యాలు ఉంటాయన్నారు. ఈ వాహనం ప్రతిరోజూ ఒక డివిజన్‌కి వెళ్ళి నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అద్భుతమైన ఆలోచన చేసిన హాస్పిటల్ సిబ్బందికి మంత్రి నారాయణ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, కమీషనర్ నందన్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జిలు, టీడీపీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

# అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులతో కలసి నిర్వహించి పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్న దృష్ట్యా, సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా రీఓపెన్ అవుతున్నటువంటి కేసులలో రెవిన్యూ అధికారులు అత్యంత జాగ్రత్త గా పరిష్కారం చూపాలన్నారు.

**ప్రరిష్కార వేదికకు 411 అర్జీలు**

కాగా సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్ర మానికి మొత్తం అర్జీలు అందాయి. వీటిలో ఎక్కు వగా రెవెన్యూ శాఖకు సంబంధించి 141, పోలీస్‌శాఖకు 62, మున్సిపల్ శాఖకు సంబంధించి 40, సర్వేకు 30, పంచాయతీరాజ్ శాఖకు 38 అర్జీలు అందాయి. కార్యక్రమంలో డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు గంగాభవాని, నాగరాజ కుమారి, హౌసింగ్ పీడీ వేణు గోపాల్, డీఎంహెచ్‌ఓ సుజాత, హార్టికల్చర్ ఏడి సుబ్బారెడ్డి, విద్యుత్ ఎస్‌ఈ విజయన్ పాల్గొన్నారు.

## ఆర్‌ఎన్‌ఆర్ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఆర్‌యన్‌ఆర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని హేమశ్రీ అనుమానస్పదంగా చనిపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని, తమకు రాజకీయ అండదండలు ఉన్నాయని ప్రచారం చేస్తున్న ఆర్‌ఎన్‌ఆర్ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్, జిల్లా అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబెర్ ఉల్లిపాయల మురళి కృష్ణ యాదవ్ కోరారు. ఈ మేరకు నెల్లూరు జిల్లా కలెక్టరేట్ల సోమవారం జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎన్‌ఆర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని హేమశ్రీ అనుమానాస్పద మృతి పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు, విజయ్, బాలాజీ, సుధీర్ యాదవ్, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్సీ లక్కీ ఈవెంట్స్ ప్రారంభించిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని ఆనం వెంకటరెడ్డి నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్సీ లక్కీ ఈవెంట్స్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆర్సీ లక్కీ ఈవెంట్స్ అధినేత బొంపెం రమేష్‌కు శుభాకాం క్షలు తెలియజేశారు. చిన్నారుల దగ్గర నుంచి పెద్దల వరకు వెస్టర్న్ క్లాసికల్, వే క్లోస్ వర్కౌట్, జుంబా డాన్సులు ఇక్కడ నేర్పిస్తామని బొంపెం రమేష్, డాన్స్ మాస్టర్ లక్కీ, అర్చి చినబాబులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జన్ని రమణయ్య, బూడిద పురుషోత్తం, నగళ్ళ రాము, గుద్దేటి చెంచయ్య, గంగాధర్, అస్లాం, మల్లికార్జున్, నారాయణ, జిలానీ లోకేష్, సిద్దయ్య, బాల, డాన్స్ మాస్టర్ శ్యాముల్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం నిల్వలు కేసులో కాకాణికి బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

రూ.25 వేల విలువ గల ఇద్దరు పూచీదారుల షూరిటీతో గోవర్ధన్‌రెడ్డిని బెయిల్‌పై విడుదల చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు. కాగా నిందితుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి కేసు దర్యాప్తులో పోలీసులకు సహకరించాలని న్యాయమూర్తి నిబంధన విధించారు. కాగా ఉభయ పక్షాల వాదనలు ఉన్న న్యాయమూర్తి నిందితుడు కాకాణికి బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ప్రస్తుతం కాకాని గోవర్ధన్ రెడ్డి జ్యుడీషియల్ రిమాండ్‌లో జిల్లా జైల్లో ఉన్నారు.

## దేశంలో పీఎం ఇంటర్న్‌షిప్ పథకం అమలు స్థితి ఏమిటి?

(మొదటి పేజీ తరువాయి)

చేరారన్నారు. జనవరి 9, 2025న ప్రారంభమైన పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ పైలట్ ప్రాజెక్ట్ రెండవ రౌండ్‌లో, దాదాపు 327 భాగస్వామి కంపెనీలు దేశంలోని 735 జిల్లాల్లో 1.18 లక్షలకు పైగా ఇంటర్న్‌షిప్ అవకాశాలను పోస్ట్ చేశాయని తెలిపారు. ఈ రౌండ్‌లో 2.14 లక్షలకు పైగా దరఖాస్తుదారుల నుండి 4.55 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని, ఆగస్టు 6 2025 నాటికి, భాగస్వామి కంపెనీలు యువతకు 78,500 కంటే ఎక్కువ ఆఫర్‌లను అందించాయన్నారు. రెండవ రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కంపెనీలు 4,700కి పైగా ఇంటర్న్‌షిప్ అవకాశాలను పోస్ట్ చేస్తే అభ్యర్థులకు 10 వేలకు పైగా ఆఫర్‌లను కంపెనీలు అందించాయని, ప్రస్తుతం, ఆఫర్‌లను అమలు ప్రక్రియ పురోగతిలో ఉందని చెప్పారు. ఈ పథకం కింద, గత మూడు సంవత్సరాల సగటు సీఎస్‌ఆర్ వ్యయం ఆధారంగా మంత్రిత్వ శాఖ టాప్ 500 కంపెనీలను గుర్తించిందని, వీటితో పాటు, ఈ పథకంలో పాల్గొనాలనుకునే ఏదైనా ఇతర కంపెనీ/బ్యాంకు/ఆర్థిక సంస్థ, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆమోదంతో ఎన్‌రోల్‌మెంట్ అవ్వొచ్చన్నారు. పైలట్ ప్రాజెక్టు అమలు కోసం మంత్రిత్వ శాఖ సీఐఐ, ఎఫ్‌ఐసీసీఐ వంటి పరిశ్రమ సహకారం ఉందన్నారు.

## ప్రభుత్వ స్కూల్స్ రూపు రేఖలు మారుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పెన్నాకట్ట, జాఫర్ కట్టమీద వారు, కుసుం హరిజన వాడికి చెందిన వాళ్ళు ఉన్నారని వివరించారు. రాబోయే జూన్ నాటికి నగరంలోని 13 పాఠశాలలను పీ4 విధానంలో ఆధునీకరించి అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు. ఈ విషయమై పలువురు ఎన్నారైలు, వివిధ కంపెనీల ప్రతినిధులతో చర్చించడం జరిగిందన్నారు. అంతేకాకుండా గోల్డ్ మర్చంట్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్, లారీ ఓనర్స్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వారితో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నుడా చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి సతీమణి సైతం కూడా ఒక స్కూలు దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చారన్నారు. పీ4 విధానం బలవంతమైన చర్య కాదని ఎవరైనాను స్వచ్ఛందంగా ముందుకు రావొచ్చని వెల్లడించారు. నెల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు 165 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. గతంలో ఉన్న బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. రాష్ట్రంలో పేద విద్యార్థులు సుమారుగా 15 లక్షల మంది వరకు ఉన్నారని, రానున్న 4 సంవత్సరాలలో వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీ రావు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, నగర అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జిలు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో 8సహకారసంఘాలకు త్రిసభ్యకమిటీలు








**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గంలోని 8 ప్రాథమిక వ్యవసాయ సహకారపరపతి సంఘాలు (పిఏసిఎస్)లకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు. ఒక్కో సొసైటికి ఒక చైర్మెన్, ఇద్దరు సభ్యులను నియమించారు. వీరంతా తెలుగుదేశంకు చెందినవారే. ఆత్మకూరు నియోజకవర్గంలో 9సొసైటీలు ఉండగా బట్టేపాడుకు మాత్రం ఇంకా నియామకం ఉత్తర్వులు ఇవ్వలేదు. మిగతా 8సొసైటిలకు కమిటీలను నామినేట్ చేశారు. నియోజకవర్గంలోని అనంతసాగరం సొసైటి చైర్మెన్‌గా జిల్లా కేంద్రసహకారబ్యాంకు చైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి నియమితులయ్యారు. ఆయన గతంలో కూడా ఇదే సొసైటి చైర్మెన్‌గా, జిల్లా కేంద్రసహకారబ్యాంకు చైర్మెన్‌గా వ్యవహరించారు. కాగా ఇటీవల ప్రభుత్వం ఆయనను జిల్లా కేంద్రసహకారబ్యాంకు చైర్మెన్‌గా నామినేట్ చేసిన విషయం విధితమే. ఆత్మకూరు పట్టణంలోని అత్యంత ప్రాధాన్యత కలిగిన, ఆత్మకూరు, సంగం, ఏఎస్‌పేట, అనంతసాగరం, మర్రిపాడు మండలాల్లోని పలు గ్రామాలు పరిధిగా కలిగి బ్యాంకింగ్ వ్యవహారాలు సాగిస్తున్న సిండికేట్ రైతు సేవా సహకార సంఘం (ఎస్ఎఫ్ఎస్‌సిఎస్)కు పట్టణానికి చెందిన ఆర్యవైశ్యసంఘ ప్రముఖుడు పరిటాల సత్యనారాయణను నియమించారు. ఏఎస్‌పేట మండలం రాజవోలు సొసైటికి చిరమనకు చెందిన కాటంరెడ్డి నారశింహారెడ్డిని నియమించారు. ఆయన గతంలోకూడా ఈ సొసైటికి చైర్మెన్‌గా వ్యవహరించారు. మర్రిపాడు మండలం బూదవాడ సొసైటికి మేకపాటి కుటుంబ స్వగ్రామమైన బ్రాహ్మణపల్లికి చెందిన వనిపెంట సుబ్బారెడ్డిని చైర్మెన్‌గా నియమించారు. అదే మండలంలోని భీమవరం సొసైటికి చైర్మెన్‌గా నందవరంకు చెందిన యర్రమల్ల చిన్నారెడ్డిని నియమించారు. ఆయన గతంలో కూడా ఈ సొసైటికి చైర్మెన్‌గా వ్యవహరించారు. చేజర్ల సొసైటికి బూదళ్ళ వీరరాఘవరెడ్డిని చైర్మెన్‌గా నియమించారు. సంగం సొసైటి చైర్మెన్‌గా గుండ్లపల్లి శ్రీనివాసయాదవ్‌ను నియమించారు. ఆయన గతంలో మండల తెలుగుదేశం అధ్యక్షుడుగా వ్యవహరించారు. ఆత్మకూరు మండలం వెన్నవాడ సొసైటికి కొల్లి నరసయ్యనాయుడును చైర్మెన్‌గా నియమించారు.



గండ్లవేడుకు చెందిన ఆయన గతంలో పడకండ్ల ఎంపిటిసి మెంబర్‌గా వ్యవహరించారు. వీరంతా రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆశీస్సులతో నియమితులయ్యారు. వారు మంత్రి ఆనంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయా మండల టిడిపి నాయకులకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మకూరు ఎస్ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మెన్‌గా నియమితులైన పరిటాల సత్యనారాయణ ఆర్యవైశ్యసంఘ ప్రముఖుడు కాగా ఆ సామాజికవర్గంలో నామినేటెడ్ పదవి లభించడం ఇదే ప్రధమం కాగా ఆయన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డికి,ఆర్యవైశ్యసంఘ నాయకులకు, తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమవంతుగా సొసైటీలను లాభాలబాటలో ఉంచేందుకు, రైతులకు సేవలందించేందుకు ప్రత్యేకశ్రద్ధతో కృషి చేస్తామని నూతన చైర్మెన్లు పేర్కొన్నారు.

# ప్రైవేటు వైద్యశాలలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

## డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పి.బ్రీజిత

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో ప్రైవేట్ వైద్యశాలలో నిర్వహించు నిర్వాహకులు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలో పాటించాలని నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ బ్రీజిత తెలిపారు. సోమవారం కావలి పట్టణంలోనే ప్రవీణ్ వైద్యశాల, లైఫ్ కేర్ వైద్యశాల, లతా తల్లి పిల్లల వైద్యశాల, రవికాంత్ వైద్యశాల, లక్ష్మీనారాయణ వైద్యశాల, ఎస్వి ల్యాబ్‌లను ఆమె ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆయా వైద్యశాలలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను రోగులకు అందిస్తున్న వైద్య సేవలను వాటి యొక్క నమోదు రికార్డులను పరిశీలించారు. అనంతరం డాక్టర్ బ్రిజిత మాట్లాడుతూ.. ప్రైవేట్ వైద్యశాలలు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరు ఆంధ్రప్రదేశ్లో అల్లోపతి, క్లినిక్ కేర్, ఎస్టాబ్లిమెంట్ యాక్ట్ 2002 కింద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని లేని ఎడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తప్పనిసరిగా పొల్యూషన్, ఫైర్ సేఫ్టీ, మెజర్మెంట్స్, బయోమెడికల్, వేస్టేజ్ వైద్యశాల అందిస్తున్న సేవలు డాక్టర్ యొక్క వివరాలు,వారు వసూలు చేస్తున్న ఫీజులు




తెలియజేసే బోర్డులను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. మూడు నెలలకు ఒకసారి ప్రతి వైద్యశాలను సందర్శించి లోటుపాట్లు ఉంటే కచ్చితంగా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ తనిఖీల కార్యక్రమంలో డాక్టర్ వెంకటలక్ష్మి, గైనకాలజిస్ట్ డాక్టర్ మేఘనాథ్, డిప్యూటీ సహాయ అధికారి ఎస్.శివకుమార్ తదితరులు ఉన్నారు.

# టీడీపీ నేత దావాకు చంద్రన్నసేవారత్న పురస్కారం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరుకు చెందిన తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి, సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు దావా పెంచలరావుకు చంద్రన్న సేవారత్న పురస్కారం లభించింది. సోమవారం నెల్లూరులోని పురమందిరంలో ఫిలింప్రొడ్యూసర్, డైరెక్టర్ వెంకట రమణ పసుపులేటి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పెంచలరావుకు ఈ అవార్డు లభించింది. వెంకటరమణ పసుపులేటి చేతులమీదుగా ఆయన ఈపురస్కారం అందుకున్నారు. అనాదిగా తెలుగుదేశం నాయకుడుగా, మండల, జిల్లా, రాష్ట్ర నాయకుడుగా వ్యవహరించారు. ఎస్ఎస్‌సీ అట్రాసిటి జిల్లాకమిటీ మెంబర్‌గా కూడా వ్యవహరించారు. టీడీపీ నాయకుడుగా పార్టీకి విధేయుడుగా ఉంటూ అన్ని ఎన్నికల్లో టిడిపి అభ్యర్థుల విజయం కోసం ప్రత్యేకంగా కృషిచేస్తుంటారు. అన్నివర్గాలకు తాను అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి తనవంతుగా ఆయన కృషి చేస్తుంటారు. ఆయన సేవలను గుర్తించిన వెంకటరమణపసుపులేటి ఈ గౌరవపురస్కారం అందజేశారు. జిల్లాలో విశేషసేవలందించే దాదాపు 30మందిని ఎంపికచేసి వారికి అవార్డులు ఇవ్వగా అందులో దావా పెంచలరావుకు కూడా చంద్రన్నసేవారత్న పురస్కారం లభించింది. ఆయనకు ఈ అవార్డు లభించడంపట్ల పలువురు తెలుగుదేశం నాయకులు, అభిమానులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో సోమశిల ఉత్తరకాలువ వైస్‌చైర్మెన్ పూనుగుంట ధనుంజయ, బసవరాజుపాళెం టీడీపీ బూత్‌కన్వీనర్ దివానపు నరశింహారావు, మహిమలూరు నీటిసంఘ వైస్‌చైర్మెన్ రంపతోటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సులకు ఆన్‌కాల్‌డ్రైవర్ల నియామకాలు : డీఎం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్‌డ్రైవర్ల నియామకం జరుపనున్నామని స్థానిక డిపోమేనేజర్ ఎం.శివకేష్‌యాదవ్ పేర్కొన్నారు. అవసరమైనపుడు ఫోన్‌చేసి పిలిపించి డ్రైవర్‌గా విధులు నిర్వహించడమే ఆన్‌కాల్‌డ్రైవర్ నియామకమని ఆయన తెలిపారు. అభ్యర్థులు హెవీమోటర్‌డ్రైవింగ్ లైసెన్సు ఉండి 18నెలల పాటు అనుభవం ఉండి 39సంవత్సరాలలోపు వారు అర్హులని ఆయన తెలిపారు. ఈ అర్హతలు కలిగి ఆసక్తిఉన్నవారు తమ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు. అర్హులు ఆన్‌కాల్‌డ్రైవర్‌గా చేరవచ్చని శివకేష్‌యాదవ్ పేర్కొన్నారు.

# పుట్టుకతో లోపాలున్నవారికి ప్రభుత్వ సేవలు




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో ఉన్న బాలభవిత కేంద్రంలో పుట్టుకతో ఏదేని లోపాలున్నవారికి వైద్య సేవలందిస్తున్నామని ఈ కేంద్ర వైద్యాధికారి తెలిపారు. కొందరికి వంకర పాదాలు, గ్రహణమొర్రి, తదితర 12లోపాలుంటాయన్నారు. అలాంటి వారికి ప్రభుత్వబాలభవిత కేంద్రంలో వైద్యసేవలు లభిస్తాయన్నారు. పురిటిబిడ్డలనుండి 18 సంవత్సరాలలోపు వారికి ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. న్యూరల్‌ట్యూబ్ డిఫెక్ట్‌లు, డౌన్‌సిండ్రోమ్, గ్రహణమొర్రి, వంకరపాదాలు, పుట్టుకతోనే వినికిడిలోపం, సంక్రమిత కంటిపొర, గుండెసంబంధిత వ్యాధులు, నాడీమండల సమస్యలు, జ్ఞానపరంగా అభివృద్ధిలో ఆలస్యం, మాటలు సరిగా రాకపోవడం తదితర సమస్యలకు చికిత్స అందిస్తామన్నారు. ఈ కేంద్రంలో చిన్నపిల్లల వైద్యులు, వైద్యాధికారి, డెంటల్ వైద్యులు, సామాజిక కార్యకర్తతోపాటు మానసికంగా అభివృద్ధిలేని పిల్లలకు విడతలవారీగా సైకాలజిస్ట్ కౌన్సిలింగ్ చేస్తారన్నారు. శారీరక ఎదుగుదల లోపాలున్నవారికి ఫిజియోథెరపి సౌకర్యం కూడా ఉందన్నారు. ల్యాబ్ సౌకర్యంతోపాటు కంటివిభాగం, స్టాఫ్‌నర్సులు కూడా ఉన్నారని, అవసరమైన వారు ఈ బాలభవితకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# ఎండుతున్న నిమ్మచెట్లు.. విలవిలలాడుతున్న బాధితుడు

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలం చాగణం రాజుపాలెం గ్రామం, చాగణం, రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 391-1, 393 ఈ రెండు సర్వే నెంబర్లకు రాకపోకల నిమిత్తం ఒకటే దారి సర్వే నెంబర్‌లో నిమ్మ చెట్లు సాగు చేసుకుంటున్నా బంకపురి రమణయ్యను బంకపురి సుందరయ్య నీటి బోరు వద్దకు పోనీకుండా 40 సంవత్సరాల నుండి అనుభవంలో ఉన్న దారి దౌర్జన్యంగా మూసి వేసి ఇబ్బందులకు గురి చేస్తూ అలాగే 643-3 సర్వే నెంబర్‌లో 2.50సెంట్లు ఉమ్మడి ఆస్తి ఉండగా సదర సర్వే నెంబర్‌లో ఆస్తిని డిపారం పట్టాగా ఉన్న ఆస్తిని బంకపురి సుందరయ్య పేరుతో 86 సెంట్లు, అసైన్మెంట్ భూమిని అసైన్మెంట్ పట్టా లేకుండా అనధికారికంగా పట్టా పాస్ బుక్ చేసుకుని ఉన్నారు. చట్ట విరుద్ధంగా చేసుకున్న పాసుబుక్కులు రద్దు చేయాలని బంకపురి రమణయ్య తమకు న్యాయం చేయాలని లేకుంటే సాగు చేస్తున్న 150 నిమ్మ చెట్లు ఎండిపోయే అవకాశం ఉందని నా కుటుంబ పోషణ వ్యవసాయం పైనే ఆధారపడి ఉందని దయవుంచి నా భూమి లోనికి దారి చూపించగలరని వేడుకుంటూ తహసిల్దార్‌కి అర్జీ అందజేశారు.



# వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దగదర్తి మండలం ఉలవపాళ్ళకు చెందిన పోలి శెట్టి శ్రీనివాసులు - హరిత దంపతుల కుమార్తె ప్రీతి రిసెప్షన్ కార్యక్రమం జమ్మలపాలెం లోని కేవిఆర్ కన్వెన్షన్‌లో జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. జలదంకి మండలం బ్రాహ్మణక్రాక అగ్రహారంకు చెందిన గొట్టిపాటి జస్మిత, గీతికల ఓణీల కార్యక్రమం జమ్మలపాలెంలోని ఎస్‌విఆర్ కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. కావలి పట్టణం పెంకుల ఫ్యాక్టరీకి చెందిన మొద్దు శ్రీనివాసులు- రమణమ్మ దంపతుల కుమార్తె సంధ్యారాణి వివాహ రిసెప్షన్ కార్యక్రమం కావలి పట్టణంలోని రామిరెడ్డి తోట కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కావలి పట్టణం చింతం వారి వీధికి చెందిన చవల ప్రసాద్, ఉషారాణి దంపతుల కుమార్తె పోలాక్షి వివాహ రిసెప్షన్ కార్యక్రమం కావలి పట్టణంలోని బృందావనం కాలనీ కల్యాణ మండపంలో జరిగింది.

# రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలతో వీబీఆర్

**ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై సుదీర్ఘ చర్చ**



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పి 4 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి నడుం బిగించారు. ఆర్థికంగా స్థిరపడిన దీ నెల్లూరు క్లాత్ మర్చంట్ అసోసియేషన్, అర్బన్ ఆర్య వైశ్య సంఘం, నెల్లూరు డిస్ట్రిక్ట్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలను కలిసి పి 4లో భాగస్వాములు కావాలని వేమిరెడ్డి విజయభాస్కర్ సోమవారం కోరారు. మంత్రి నారాయణ సూచనల మేరకు ప్రభుత్వపరంగా అన్ని రకాలుగా సహకరిస్తామని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ముందుకు రావాలని వేమిరెడ్డి కోరారు. సానుకూలంగా స్పందించిన అసోసియేషన్ నేతలు మంత్రి నారాయణ ఓ మంచి సంకల్పంతో నెల్లూరు నగరంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంతగానో పాటుపడుతున్నారని, తమ వంతుగా ఆయనకు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ నుడా చైర్మన్ ముక్కాల ద్వారకా నాథ్, ఆరవ డివిజన్ అధ్యక్షుడు కొండ ప్రవీణ్, రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, కిషోర్ రెడ్డి, మల్లికార్జున, సురేంద్ర, శేషారెడ్డి పాల్గొన్నారు.



## పీ-4లో భాగస్వాములు కండి : వీబీఆర్

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** ది నెల్లూరు క్లాత్ మర్చంట్ అసోసియేషన్ నేతలను సోమవారం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి వారి అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు వేమిరెడ్డిని ఘనంగా సత్కరించి శాలువాలతో సన్మానించారు. అనంతరం పలు అంశాలపై వారితో చర్చించారు. ప్రధానంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పి-4లో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన అసోసియేషన్ నాయకులు త్వరలో అందుకు సంబంధించిన విధివిధానాలను తెలియజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు టీవీ కిషోర్ బాబు కార్యదర్శి పి.ధనుంజయ, డి.సునీల్‌బాబు, ఉపాధ్యక్షులు నాగేంద్రరావు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

## చేజర్ల పీఏసీఎస్ ఛైర్మన్‌గా భూదళ్ళ వీరారఘవ రెడ్డి



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** చేజర్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) ఛైర్మన్‌గా భూదళ్ళ వీరారఘవ ఎంపిక య్యారు. సభ్యులుగా వావిలేరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మదమంచి సుధీర్ కుమార్, నడిగడ్డ అగ్రహారం గ్రామానికి చెందిన ఆరుఎద్దుల రామకృష్ణయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా భూదళ్ళ వీరారఘవ రెడ్డి మాట్లాడుతూ.. తమకు పదవులు వచ్చేందుకు కృషి చేసిన రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, టీడీపీ సీనియర్ నాయకులు కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తాళ్లూరి గిరినాయుడు వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కాగా మంత్రి ఆనం సహకారంతో చేజర్ల సొసైటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

**ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ..**

# జీవితానికి భరోసా



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో బ్రాంచ్ చీఫ్ మేనేజర్ వై.రామకృష్ణ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాలు నుండి అమలుపరిచే బీమా పథకాలు, లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీల గురించి ఆయన వివరించారు. నిరుపేద కుటుంబాలు వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన వెల్లడించారు. నెలకు 20 రూపాయల నుండి పదివేల రూపాయల వరకు భీమా పాలసీ చెల్లించిన ఎడల, ప్రమాదవశాత్తు మరణించినప్పుడు ఈ భీమా మొత్తం ఖాతాదారులకు వడ్డీతో సహా బ్యాంక్ అందిస్తుందని ఆయన తెలియజేశారు. చైల్డ్ పాలసీలు డిపాజిట్ చేస్తే వారు చదువురీత్యా, ఉద్యోగరీత్యాకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ పాలసీల గురించి మా స్టేట్ బ్యాంక్ తరపున ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

## గడ్డం ఫకీరయ్య దాతృత్వం వెలగట్టలేనిది



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలో ఎంతోమంది ధనవంతులు ఉంటారు కానీ వారిలోదానగుణం కలవారు అరుదుగా ఉంటారు. తోటి మనుషులు బాధపడుతుంటే తన మనసుకు బాధ కలుగుతున్నట్లు భావించే వ్యక్తులు కొందరు ఉంటారు. వారి బాధను పంచుకోవాలని ఆలోచన కలిగిన వారిలో గడ్డం పకీరయ్య ఒకరు తను గతంలో అనేకమంది పేదలను ఆదుకున్నారు. అయ్యా సాయం కావాలని అడిగితే తనకు ఉన్న దానిలో కొంతైనా అందించి సాయపడే గుణం కలవాడు. అదే క్రమంలో వింజమూరు జిబికెఆర్ ఎస్టీ కాలనీకి చెందిన వృద్ధురాలైన పోలమ్మకు పేదరికంగా ఉండి కనీసం వృద్ధాప్య పింఛన్ కూడా రాకపోవడంతో పూట గడవడమే కష్టంగా ఉన్నా తరుణంలో ఈ విషయం ఫకీరయ్య దృష్టికి రాగా ఆయన ఆమె స్వగృహానికి వెళ్లి ఉడతా భక్తిగా 5వేల రూపాయల నగదు బియ్యం బస్తా నూనె పప్పులు ఇచ్చి ఆదుకున్నారు భగవంతుడు ఇచ్చిన దానిలో ఎంతో కొంత పేదవారిని ఆదుకోవాలనే ఆలోచన గొప్ప విషయమని పలువురు కాలనీవాసులు ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత మందిని ఆదుకునే విధంగా భగవంతుడు ఆయనకు శక్తిని ఇవ్వాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీవీ రిపోర్టర్ మాధవ వార్త రిపోర్టర్ ఎస్.నరసింహ, ఎన్ త్రి రిపోర్టర్ ఆర్.రాము, ప్రైమ్ నైన్ రిపోర్టర్ రాజేష్, యాక్ట్ రిపోర్టర్ సురేష్ తదితరులు ఉన్నారు.

# ఎన్‌సీసీ విద్యార్థులకు అవగాహన

**లీడింగ్ క్యాడెట్ షేక్ అమీర్**





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని వివేకానంద కాలేజీలో విద్యార్థులకు ఎన్‌సీసీపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఎన్‌సీసీపై అవగాహన పెంచుకున్నారు. ఎన్‌సీసీలో చేరడం పట్ల దేశభక్తి పెరుగుతుందని, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ కూడా వస్తాయని అదేవిధంగా శారీరక ఫిట్నెస్ మెరుగుపడుతుందని లీడింగ్ క్యాడెట్ షేక్ అమీర్ తెలియజేశారు. భవిష్యత్తులో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో చేరడానికి తోడ్పాటు అందిస్తుందని వెల్లడించారు. ఇతర పోటీ పరీక్షలకు కూడా ప్రాధాన్యత లభిస్తుందని, ఎన్సిసి అనేది విద్యార్థులకు మంచి ప్రాముఖ్యత కలిగిన కార్యక్రమని ఇది మనల్ని మంచి పౌరులుగా తీర్చిదిద్దుతుందని ఈ సందర్భంగా అమీర్ విద్యార్థులకు తెలిపారు. గతంలో తాను అనేక క్యాంపుల్లో పాల్గొని ఉన్నానని,క్యాంపులో జరిగిన విషయాలను విద్యార్థులకు అమీర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద కాలేజీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ఆక్రమిస్తూ వ్యాపారాలు చేయకుండా పర్యవేక్షించండి



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని మద్రాస్ బస్టాండ్ ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ ప్రాంగణం పరిసరాలలో రోడ్లను ఆక్రమిస్తూ వ్యాపారాలు నిర్వహిస్తూ, ట్రాఫిక్ అంతరాయాలకు కారణంగా నిలుస్తున్న రోడ్డు మార్జిన్ దుకాణాలను తొలగించి, తిరిగి ఏర్పాటు చేయకుండా ప్రతిరోజు పర్యవేక్షించాలని కమిషనర్ వై.ఓ నందన్ శానిటేషన్ విభాగం అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక ఏసి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంగణాలను కమిషనర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్ రోడ్డు వెంబడి ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న దుకాణాలు, రోడ్లకు పక్కగా కూరగాయలు, పండ్ల వ్యర్థాలు, రోడ్డుపై అపరిశుభ్రంగా ఉన్న పరిసర ప్రాంతాలు, రోడ్లపై సంచరిస్తున్న పశువులను గుర్తించిన కమిషనర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంహెచ్ఓను ఆదేశించారు. పెద్ద సంఖ్యలో వినియోగదారులు విచ్చేసే కూరగాయల మార్కెట్ రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, మార్కెట్ పరిసర ప్రాంతాలను నిరంతరం అత్యంత పరిశుభ్రంగా ఉంచి పారిశుధ్య ప్రమాణాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలని దుకాణాదారులు, మార్కెట్ అసోసియేషన్ నిర్వాహకులను కమిషనర్ సూచించారు. నిబంధనలను అతిక్రమించిన వారిని గుర్తించి జరిమానాలు విధించాలని, రోడ్డు ఆక్రమణలు పునరావృతం కాకుండా నిరంతర పర్యవేక్షించాలని శానిటేషన్ విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, శానిటరీ సూపర్వైజర్ ఆశీర్వాదం, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శి హీన తదితరులు పాల్గొన్నారు.

# నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య సూచనలతో టౌన్ డీఎస్పీ సింధు ప్రియా ఆధ్వర్యంలో సామాన్య ప్రజలలో ధైర్యం నింపుతూ పోలీస్ వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచడానికి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టే లక్ష్యంగా నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడిగాడి తోట, అహ్మద్ నగర్, బర్మసాల్ గుంట ప్రాంతాలలో సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది సుమారు వంద మందితో సోమవారం ఉదయం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, దొంగతనాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా సుమారు 350 ఇళ్లను క్షుణ్ణంగా శోధించి, సరైన పత్రాలు లేని 35 బైకులు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానితులుగా ఉన్న వ్యక్తుల వద్ద వేలుముద్రలను సేకరించారు. ఈ సందర్భంగా టౌన్ డీఎస్పీ సింధుప్రియా మాట్లాడుతూ.. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు కఠినమైన ఆదేశాలు ఉన్నాయని, అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు నమోదు చేస్తామని తెలియజేశారు. అదే విధంగా వెండి, బంగారు వంటి చోరీ సొత్తు, అనుమానంగా ఉన్న వారు, రికార్డులు లేని అన్ని వస్తువులు, వాహనాలు, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వంటి వాటిని గుర్తించి స్వాధీనపర్చుకోవడమే ఈ యొక్క కార్డన్ సర్చ్ ముఖ్య ఉద్దేశమని డీఎస్పీ తెలియజేశారు. అంతేకాకుండా అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు తెలియజేయాలని ప్రజలు తమవంతు సహకారాన్ని అందించాలని ఈ సందర్భంగా డీఎస్పీ కోరారు.



## చల్లా వెంకటేశ్వర్లుకు యువత ఘన సన్మానం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు సొసైటీ చైర్మన్‌గా నియమితులైన చల్లా వెంకటేశ్వర్లు పై తమ అభిమానాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు సోమవారం ఉదయం తమిదపాడు, కాటేపల్లి, శంఖవరం, వెంకటాద్రిపాలెం తదితర గ్రామాలకు చెందిన యువకులు, టీడీపీ నాయకులు, చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ స్వగ్రామం అయిన బొమ్మరాజుచెరువు లోని ఆయన స్వగృహాని కి చేరుకుని శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మిఠాయిలు పంచి సంభరాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వింజమూరు మండల రాజకీయాల్లో పరిణతి కలిగిన నేత చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ అని పేర్కొన్నారు. చల్లా హయంలో వింజమూరు సొసైటీ మరింతగా అభివృద్ధి చెందడంతోపాటు, రైతుల సంక్షేమం అక్షరాలా సాధ్యం అవుతుంది అని అన్నారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే చల్లా వెంకటేశ్వర్లుని సొసైటీ చైర్మన్‌గా నియమించడం అభినందనీయమని తెలిపారు. తెలుగుదేశం అధికారంలో లేని సమయంలో కూడా పార్టీ కోసం నిరంతరం కృషిచేసి ఆర్టీ విజయానికి శ్రమించారన్నారు సీబీఎన్‌ఈ శ్రమ ఫలితమే ఈ పదవి రావడానికి దోహదపడింది అన్నారు అదేవిధంగా డైరెక్టర్లుగా వెలుగోటి శ్రీనివాసులు కోడూరు నాగిరెడ్డిలును నియమించడం జరిగింది. ఈ పదవి రావడానికి కారకులైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి స్థానిక నేతలకు యువకులు, టీడీపీ నేతలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## 30 అడుగుల బాటను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల గ్రామంలోని మట్టెంపాడు నందు సర్వే నెంబర్ 3లో సాగు చేసుకుంటున్న గ్రామస్తులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని డీఆర్ఓకి వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్ మాట్లాడుతూ.. నెల్లూరు రూరల్ మండల రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ రాచమల్లు రమేష్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామంలోకి పోయే 30 అడుగుల బాటను ఆక్రమించి ఎలాంటి హక్కులు లేకపోయినా 30ఎకరాలలో టెంకాయ మొక్కలను నాటుతూ తన పనిని కొనసాగిస్తున్నాడని రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకొని గ్రామంలోకి పోయే బాటను, 30ఎకరాల ఈనామ్ భూములను అన్యాక్రాంతం చేయకుండా కాపాడాలని మట్టెంపాడు పేదలు ప్రజలు సాగు చేసుకుంటున్న 110 ఎకరాలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు ఎన్.రఘురామయ్య, పి.దయాకర్‌లు పాల్గొన్నారు.

## సొసైటీ డైరెక్టర్లుగా శ్రీను, నాగిరెడ్డిలు





**వింజమూరు, మేజర్ న్యూస్ :** వింజమూరు సొసైటీ చైర్మన్‌గా బీసీ సంఘం నాయకులు బొమ్మరాజు చెరువు గ్రామ నివాసి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ నియమించబడ్డారు. అదేవిధంగా సొసైటీ డైరెక్టర్లుగా కోడూరు నాగిరెడ్డి గని శ్రీనివాసులు నియమించబడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సొసైటీ అభివృద్ధికి రైతుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రయత్నించి వారి సంక్షేమ లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ పదవులు రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎఫ్‌సీవి పొగాకుకు 142 మిలియన్ల అనుమతి

## ఈనెల 18 నుంచి రిజిస్ట్రేషన్లు : డీసీపల్లి సూపరిండెంట్ రాజశేఖర్



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** 2025-26 పంట కాలానికి సంబంధించి ఎఫ్‌సీవి పొగాకు గల గిరాకిని, ప్రస్తుత నిల్వలను దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్‌లో 142 మిలియన్ కిలోలు ఉత్పత్తికి అనుమతించడం జరిగిందని మర్రిపాడు మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం సూపరింటెండెంట్ జి.రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఎఫ్‌సీవి పొగాకు రైతుల కోరిక మేరకు, రైతుల సౌకర్యార్థం భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ జారి చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఈ సంవత్సరం నుండి రిజిస్ట్రేషన్ 3 సంవత్సరాలకు ఒక్కసారి మంజూరి చేయడం జరుగుతుందని తెలిపారు. ఎఫ్‌సీవి పొగాకు రైతులు రేజిస్ట్రేషన్‌లు 18వ తేదీ సోమవారం నుండి ప్రారంభమవుతాయని తెలిపారు. ఎటువంటి అపారద రుసుము లేకుండా 27వ తేదీ వరకు, రూ.100అపారద రుసుముతో నవంబర్ 7వ తేదీ వరకు, రూ.400 అపారద రుసుముతో నవంబర్ 19వ తేదీ వరకు రేజిస్ట్రేషన్ అప్లికేషన్‌లు స్వీకరించబడతాయని తెలియజేశారు. 2025-26 పంటకాలనికి సంబంధించి దక్షణ తేలిక నేలలు (ఎస్ఎల్ఎస్)కు ఒక బ్యారన్ 2.90 హెక్టర్లు(7.25 ఎకరాలు), బ్యారన్‌కు 3665 కిలోలు పండించడానికి అనుమతి ఇచ్చారన్నారు. 2025-26 సంవత్సరంలో రేజిస్ట్రేషన్ అయిన రైతులు 2025-26 నుండి 2027-28 పంటకాలం అనగా తదుపరి 3 సంవత్సరాలు రేజిస్ట్రేషన్ చేసుకోనవసరం లేదు అని, ఈ సంవత్సరం రేజిస్ట్రేషన్ రెన్యూవల్ అయిన బ్యారన్లు తదుపరి 3 సంవత్సరాలు అనగా 2027-28 పంట కాలం వరకు మీ రిజిస్ట్రేషన్ రద్దు చేయబడదు, అని, ఎటువంటి బ్యారన్ బదిలీలు ఉండవు అని, లీజు అగ్రిమెంట్లు కూడా 3 సంవత్సరాలకు అనగా 2025-26 నుండి 2027-28 వరకు చేయుంచుకోవాల్సిందిగా తెలియజేశారు. ఎఫ్‌సీవి పొగాకు విత్తనాలు ఎన్ఐఆర్‌సిఏ కందుకూరు నందు రైతులకు ఇస్తున్నారు అని, కమర్షియల్ నారు వేసే రైతులు పొగాకు బోర్డు నందు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా, పొగాకు నారును బ్యారాన్ ఉన్న రైతులకు మాత్రమే అమ్మాలని, వాటికి సంబంధించిన వివరాలను పొగాకు బోర్డు అధికారులు తనిఖీ చేస్తారని తెలియజేశారు.

# మర్రిపాడులో జీతాలు కోసం వీఆర్ఏల నిరసన



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని 24 పంచాయతీలల్లో పనిచేస్తున్నటువంటి వీఆర్ఏలకు గత మూడు నెలల నుంచి జీతాలు లేక అవస్థలు పడుతున్నారు. మాకు జీతాలు రాకా మూడు నెలల నుంచి ఇబ్బంది పడుతున్నామని తహసిల్దార్‌ని సోమవారం అడగగా మీకు జీతాలు పెట్టే సీనియర్ అసిస్టెటు లేనందువలన మీ కోడు ఇన్ యాక్టివ్‌లో ఉన్నది అందువల్ల మీకు జీతాలు రాలేదు అని సమాధానం ఇవ్వడంతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బత్తల రత్నయ్య మాట్లాడుతూ.. మండలంలో ఉన్న స్టాఫ్ మొత్తానికి జీతాలు ఒకటో తేదీని తీసుకుంటున్నారు. కానీ వీఆర్ఏలకు ఎందుకు జీతాలు రావడం లేదు? వాళ్లకు ఉన్న కోడు వీళ్లకు వర్తించదా 3నెలల నుంచి జీతాలు రాకపోతే వాళ్ళు కుటుంబాలను ఎలా పోషించుకోవాలి ఎలా బ్రతకాలి సాలి సాలని జీతాలతో కుటుంబాలు పోషించుకోవడం అతి కష్టంగా ఉన్నది. గతంలో ఉన్న జూనియర్ అసిస్టెంట్ బదిలీ అయిపోతే మరొకరితో నైనా కోడు పెట్టుకోవాలి జీతాలు వచ్చేటట్లు చేయాలి ఇది తాసిల్దార్ బాధ్యతే కదా ఇలా ఇబ్బంది పెట్టడం ఎంతవరకు కరెక్ట్ ఇప్పటికైనా తాసిల్దార్ స్పందించి కోడ్ యాక్టివేషన్ అయ్యేవిధంగా చేసి వీఆర్ఏలకు జీతాలు ఇచ్చేదానికి ప్రయత్నం చేయాలని, లేని పక్షములు కార్యాలయం ముందు ధర్నాకు కూర్చోవాల్సి వస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సయ్యద్ రహంతుల్లా, వీఆర్ఏల మండల కార్యదర్శి ఓబులేసు, సుబ్బారావు నానాజీ, వీఆర్ఏలు పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయాన్ని అలవర్చుకోవాలి



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడు శ్రీ శక్తి భవనంలో ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు యూనిట్ ఇన్‌చార్జ్ బాలకిషోర్, ఖాదర్పూర్ ఎస్సిఆర్పి నవ్య, డిజిటల్ అసిస్టెంట్, దుద్దుగుంట కుమారి ఆధ్వర్యంలో తోటకూర పాలకూర, గోగాకు, వంకాయలు, మునగాకు, బెండకాయలు, చిక్కుడుకాయలు శ్రీ శక్తి భవనంలో సోమవారం అమ్మడం జరిగింది. ఈ సందర్భంగా యూనిట్ ఇంచార్జ్ బాలకిషోర్ మాట్లాడుతూ.. పకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు తినడం మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని ఆయన అన్నారు. మీరు కూడా ప్రతి ఒక్కరు మీ ఇల్లు ఆవరణంలో కాళీ ప్రదేశం ఉంటే కూరగాయ విత్తనాలు గోవాకు తోటకూర పెంచుకుంటే మంచి ఆహారాన్ని పొందచ్చని డబ్బులు ఆదా చేయొచ్చని ఆయన అన్నారు. ఉపాధిహామీ పథకం ఏపీఓ వెంకటనారాయణ మాట్లాడుతూ.. గత సోమవారం కూడా నేను శ్రీ శక్తి భవనంలో కొనుక్కొని తీసుకోవడం జరిగింది దుకాణంలో కూరగాయలకి పకృతి వ్యవసాయం పండించిన కూరగాయలకి తేడా ఉందని రుచికరంగా ఉందని ఈ విధంగా మనం ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవచ్చని మా పథకం ద్వారా కూడా ప్రతి ఒక్క కూలీకి మేము కూడా చెప్పే కార్యక్రమం తీసుకొస్తామని ఎరువులతో కూరగాయలు పండించుకోండి గత వారం కూడా మేము చెప్పడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పకృతి వ్యవసాయం సిబ్బంది ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ చైర్మన్‌గా ఎస్.వెంకయ్య నియామకం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలం సర్వేయపాలెం సొసైటీ చైర్మన్గా ఎస్. వెంకయ్యను కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నియమించారు. అనంతరం ఎన్నికైన ఎస్ వెంకయ్య మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి సొసైటీ చైర్మన్గా నియమించినందుకు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతే కాకుండా పార్టీని బలోపేతం చేసేందుకు, సొసైటీలో ఉన్న సభ్యులకు సొసైటీ తరఫున ప్రజలకు అందవలసివి రైతులు అందేందుకు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సహకారంతో ముందుకు సాగిపోతామని తెలిపారు.

## రాజవోలు పీఏసీఎస్ చైర్మన్‌గా కాటంరెడ్డి



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం రాజవోలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా చిరమణ గ్రామానికి చెందిన కాటంరెడ్డి నరసింహారెడ్డి ఎంపికయ్యారు. అలాగే చందలూరుపాడు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు చిన్నం మధుసూదనరావు రాజవోలు గ్రామానికి చెందిన నారే వెంకటసుబ్బయ్యలను సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కాటంరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. తమకు పదవులు వచ్చేందుకు కృషిచేసిన రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు అలాగే సొసైటీ అభివృద్ధికి మంత్రి ఆనం సహకారంతో తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు మండలంలోని రైతులకు అవసరమైన వాటిని అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## గిరిజనులకు ఉచితంగా సబ్బులు పంపిణీ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు పట్టణానికి చెందిన ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని చెన్నారెడ్డిపల్లి గిరిజన కాలనీలో ప్రజలకు సంతూర్ సబ్బులను ఆ సంస్థ సెక్రటరీ అహ్మద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతను ప్రోత్సహించడానికి, ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలలో భాగంగా ఒక్కొక్కరికి ఐదు సబ్బులను 35 కుటుంబాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. పరిశుభ్రతను ప్రోత్సహించడం ద్వారా, మనం ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి శివజ్యోతి, ఏఎన్ఎం ఎస్‌కే సాజిదా, 104 డీఈవో రహమతుల్లా, ఆశా కార్యకర్త లక్ష్మీ ప్రసన్న, అమ్మవారిపాలెం హెచ్ఎం నౌరాజ్, టీచర్ వి.హాజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## మర్రిపాడు పీఏసీఎస్ చైర్మన్లుగా యర్రమల, వనిపెంట





**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని భీమవరం సొసైటీకి సంబంధించిన అధ్యక్షునిగా యర్రమల చెన్నారెడ్డిని, బూదవాడ సొసైటీ అధ్యక్షునిగా వనిపెంట సుబ్బారెడ్డిని సోమవారం నియమించినట్లు ఉత్తర్వులు అందాయి. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో వారు చేస్తున్నటువంటి సేవలను గుర్తించి ఈ పదవులను అప్పజెప్పినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా నూతనంగా సొసైటీలకు అధ్యక్షులుగా ఎంపిక అయిన తరుణంలో వారు మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి తగు సేవలు అందిస్తామని తెలియజేశారు. దీంతోపాటుగా మండలంలోని పలు టిడిపి నాయకులు కార్యకర్తలు వారికి అభినందనలు తెలియజేశారు.

# పీ4 కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టిన మంత్రి నారాయణ

- జైన్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ నేతలతో మంత్రి నారాయణ భేటి
- పాఠశాల ఆధునీకరణకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్న అసోసియేషన్ నేతలు
- నగరంలోని 13 హైస్కూల్స్ ని వచ్చే విద్యాసంవత్సరం లోపు రూపులేఖలు మారుస్తాం
- ఆర్థికంగా స్థిరపడ్డ నెల్లూరు వాసులు పీ4లో భాగస్వాములు కావాలన్న మంత్రి..



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ4 కార్యక్రమంపై రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రత్యేక దృష్టి పెట్టారు. సీఎం ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా అయన అడుగులు వేస్తున్నారు.. అందులో భాగంగా పీ4 ద్వారా మున్సిపల్ హైస్కూల్లు ఆధునికరణకు శ్రీకారం చుట్టారు. పెద పిల్లలు చదివే స్కూల్స్‌ను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముందుకు వస్తున్నారు. మరింత మంది ముందుకు వచ్చేలా మంత్రి సీరియస్‌గా దృష్టి పెడుతున్నారు. అందులో భాగంగానే జైన్ అసోసియేషన్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ నేతలతో మంత్రి నారాయణ సోమవారం భేటీ అయ్యారు. స్కూల్ ఆధునికరణకు తమ వంతు సహకారం అందిస్తామని మంత్రికి అసోసియేషన్ నేతలు తెలిపారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం వీఆర్‌ని అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధం చేసి ప్రారంభించామని, వీఆర్ హై స్కూల్ స్ఫూర్తితో మార్గదర్సకులు ముందుకొస్తున్నారని తెలిపారు. మూలాపేట బాలికోన్నత పాఠశాలను డిఎస్సార్, అరెస్సార్ హైస్కూల్‌ను ఎంపీ విపీఆర్ దత్తత తీసుకొన్నారని, పనులు కూడా ప్రారంభం అయ్యాయని.. రెడ్డి లాబ్స్ జీవీకే ప్రసాద్, ఎన్నార్ఐ ఉదయ భాస్కర్, ఏఎంఆర్ కనస్ట్రక్షన్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి సతీమణి సంధ్యా, డాక్టర్ అనీల్ ,జైన్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ స్కూల్స్‌ని ఆధునీకరించేందుకు ముందుకొచ్చారని మంత్రి వెల్లడించారు. సిటీలోని 13 హైస్కూల్స్‌ని వచ్చే విద్యా సంవత్సరం లోపు విఆర్సీ తరహాలో తీర్చి దిద్దుతామన్నారు. ఆర్థికంగా స్థిరపడ్డ నెల్లూరు వాసులు పీ4లో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. సీఎం ప్రవేశ పెట్టిన పీ4 కార్యక్రమం ఆశయం చాలా గొప్పదని కొనియాడారు. పీ4లో తమ అసోసియేషన్ కూడా భాగస్వామి అవుతుందన్నారు. బాలాజీ నగర్‌లో మల్లెల సంజీవయ్య స్కూల్ ఆధునీకరణకు తమ వొంతు సహకారం అందిస్తామని తెలియజేశారు. వీఆర్సీపై దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా తీర్చిదిద్దిన మంత్రి నారాయణకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, టీడీపీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.



# ఎస్ఈఐఎల్‌కు అడ్మిన్ బిల్డింగ్ కుప్లాటినం గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికేషన్



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి రంగంలో సమర్థవంతంగా రాణిస్తున్న ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు చెందిన అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌కు ప్రతిష్టాత్మక ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ప్లాటినం' గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికేషన్ వచ్చింది. సోమవారం ఈ విషయాన్ని ప్రాజెక్ట్ యాజమాన్యంతెలిపింది. ఎస్ఈఐఎల్ ఎనర్జీ యొక్క స్థిరత్వం, పర్యావరణ పరిరక్షణ బాధ్యతలో నిబద్ధతకు నిదర్శనంగా వచ్చినట్లు పేర్కొంది. ప్రాజెక్ట్-1లో ఉన్న కంపెనీ అడ్మిన్ భవనం ప్రస్తుత గ్రీన్ బిల్డింగ్ రేటింగ్ సిస్టమ్‌లో 80శాతం కంటే ఎక్కువ రేటింగ్‌ను సాధించింది. భారతదేశంలో ప్లాంట్ ప్రాంగణంలో గ్రీన్ బిల్డింగ్‌ను కలిగి ఉండి, ప్లాటినం గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికేషన్ పొందిన మొట్ట మొదటి థర్మల్ పవర్ ప్లాంట్‌గా నిలిచింది. 3 సంవత్సరాలకు గుర్తింపును పొందినట్లు అధికారులు తెలిపారు. ఎస్ఈఐఎల్ ఎనర్జీ కార్బన్ ఉద్గారాల తగ్గింపు, స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడంలో దాని అకింతభావానికి నిదర్శనమన్నారు. విజయవాడలో జరిగిన 'గ్రీన్ ఆంధ్ర సమ్మిట్ 2025'లో ఐజిబిసి ప్లాటినం సర్టిఫికేషన్‌ను ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ భాగస్వామ్యంతో ఐజిబిసి నిర్వహించిన ఈ సమ్మిట్రాష్ట్రవ్యాప్తంగా స్థిరమైన అభివృద్ధిని వేగవంతం చేయడానికి విధాన రూపకర్తలు, నిపుణులను ఒకే చోట చేర్చినట్లు తెలియజేశారు. కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జనమేజయ మహాపాత్ర మాట్లాడారు. పర్యావరణ నిర్వహణ పట్ల మా నిబద్ధతను ప్రతిబింబించే ఈ ప్రతిష్టాత్మక గుర్తింపును అందుకోవడం పట్ల సంతోషంగా ఉందన్నారు. అంకితభావం, కృషి లేకుండా ఈ విజయం సాధ్యం కాదన్నారు. వ్యర్థాలను తగ్గించడంలో ఎస్ఈఐఎల్ ఎనర్జీ యొక్క స్థిరత్వం పట్ల నిబద్ధత స్పష్టంగా కనిపిస్తుందన్నారు. కంపెనీ యొక్క దూరదృష్టి గల నాయకత్వం, అంకితభావం కలిగిన బృందం దాని సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ జనరేషన్ కాంప్లెక్స్‌లో సుస్థిరతను జీవన విధానంగా మార్చుకుందన్నారు.

# రైల్వే కోర్టు మెజిస్ట్రేట్ వినోద్ బదిలీ



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ప్రత్యేక రైల్వే కోర్టు మెజిస్ట్రేట్ పాలమంగళం వినోద్‌ను కర్నూలు జిల్లా డోన్ పట్టణ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు సోమవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది న్యాయమూర్తి వినోద్ 2023 ఫిబ్రవరిలో నెల్లూరు రైల్వే కోర్టు మెజిస్ట్రేట్‌గా ఛార్జ్ తీసుకున్నారు. ఈ కోర్టు అటు నెల్లూరు జిల్లా ప్రకాశం జిల్లా బాపట్ల వరకు ఇటు చిత్తూరు పాకాల వరకు విస్తృతమైన జ్యూరిస్డిక్షన్ అయినప్పటికీ న్యాయమూర్తి వినోద్ ఎంతో పని ఒత్తిడి ఉన్నా అవలీలగా కేసులను విచారించి పరిష్కరించేవారు రైల్వే స్టేషన్ల వెంబడి పరిధితో పాటు నెల్లూరు జిల్లా కృష్ణపట్నం ముత్తుకూరు తోటపల్లి గూడూరు పోలీస్ స్టేషన్ల పరిధికి చెందిన క్రిమినల్ కేసులను కూడా విచారించి తీర్పు చెప్పేవారు ఎవరిని నొప్పింపక కేసుల పరిష్కారమే ధ్యేయంగా న్యాయమూర్తి అటు న్యాయవాదులతో ఇటు సిబ్బందితో వ్యవహరించేవారు న్యాయమూర్తి ప్రస్తుతం జూన్ 23 నుండి సెప్టెంబరు 14 వరకు గుంటూరు జిల్లా మంగళగిరి ఆంధ్ర ప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీలో శిక్షణ పొందుతున్నందువల్ల శిక్షణ అనంతరం నెల్లూరు చేరుకొని చార్జ్ అప్పగించి ధోన్‌కు వెళతారు తదుపరి న్యాయమూర్తిని నియమించేంతవరకు నెల్లూరు నాలుగవ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఈ కోర్టుకు ఇన్చార్జిగా వ్యవహరిస్తారు.

## కోర్టుకు హాజరైన బీజేపీ నేతలు




**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** గత ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యల కోసం గల మెత్తిన బీజేపీ నాయకులు మీద నమోదైన కేసుల విచారణకు బీజేపీ నేతలు హాజరైనారు. సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయ రెడ్డి, సురేందర్‌రెడ్డి, కాకు విజయలక్ష్మి. మిడతల రమేష్, భరత్ కుమార్ యాదవ్, కరణం భాస్కర్, జనసేన నాయకుడు గునుగుల కిషోర్ తదితర నేతలు కోర్ట్ కేసులకు హాజరయ్యారు.

# జ్యోతిష కిరీటి బిరుదు ప్రధానం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** జ్యోతిష రంగంలో విరివిగా అవార్డు తీసుకుంటున్న ప్రముఖ జ్యోతిష శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ ప్రతిష్టాత్మకమైన జ్యోతిష కిరీటి బిరుదు తీసుకున్నారు. సోమవారం ఆయన మేజర్‌న్యూస్‌తో మాట్లాడారు. బిగ్ వేవ్ ఈవెంట్స్ 17 వసంతాల విజయోత్సవ వేడుకలు సందర్భంగా ఈ బిరుదును ప్రధానం చేసినట్లు తెలిపారు. అభినందన పురస్కార ప్రధానోత్సవ అక్షర మందారమాలను అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంతో ఆత్మీయంగా సన్మానం చేశారని పేర్కొన్నారు. ఆర్గనైజర్ వై.రవి బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎస్‌వి రమేష్ (చెన్నై ఇన్ఫర్మేషన్ సెంటర్) భాజపా నాయకులు సురేంద్ర రెడ్డి, శింగంశెట్టి మురళీ, విశ్వమాత సేవా ట్రస్ట్ నిర్వాహకులు దూబిశెట్టి కళ్యాణి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొన్నారు.

# సైదాపురంలో అక్రమ మైనింగ్

- ప్రమాద అంచులలో గ్రామస్థులు, పర్యావరణం
- అక్రమ మైనింగ్ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు రాజేష్ కుమార్ వెల్లడి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా పరిధి లోని సైదాపురం, గూడూరు, పరిసరాలలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను నిర్వహించే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అక్రమ మైనింగ్ పోరాట సమితి అధ్యక్షుడు ఎం.రాజేష్ కుమార్ కోరారు. సోమవారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లాలో సహజ వనరులలో ఒకటైన సిలికా, తెల్ల రాయి ప్రసిద్ధి అయితే కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో జోరుగా ఈ దందా నడపడం గమనార్హం. గత ప్రభుత్వంలో ఇదే పరిస్థితి ప్రస్తుతం ఇదే శైలిని కొసాగించడం జరుగుతుందన్నారు. దీనికి తోడు ఈ అక్రమ మైనింగ్‌ను ప్రశ్నించిన గొంతుపై అక్రమ కేసులు పెట్టడం అలవాటు అయిందని, గతంలో ఎన్నోసార్లు ఈ అవినీతిపై జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్న పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. అక్రమంగా సహజ వనరులను దోచేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పు కలుగుతుందని ఆరోపించారు. రాజకీయ నాయకులు చేస్తున్న అక్రమ మైనింగ్‌కు అధికారులు వంతు పాడటం వల్ల సహజవనరులు అంతరించి పోయే ప్రమాదం ఉందన్నారు. సైదాపురంలోని కెఎస్ఆర్ కంపెనీ, సిద్ధి వినాయక మైనింగ్ కంపెనీ, షిరిడి సాయి మైన్స్, శోభారాణి మైకా కంపెనీ, వెంకట కనకదుర్గ, ఉమామహేశ్వర మైకా మైన్స్‌లలో యధేచ్ఛగా అక్రమ మైనింగ్ జరుగుతుందని ఆరోపించారు. అక్రమ మైనింగ్‌పై ఏడిఎంజి డిడి, కాలుష్య నియంత్రణ మండలి శాఖ, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్, తదితర శాఖలవారు తనిఖీ చేసి నోటీసులు ఇచ్చినప్పటికీ ఆ దేశంలో ఏమాత్రం లెక్కచేయకుండా మైనింగ్ మాఫియా జరుగుతుందన్నారు. అక్రమ మైనింగ్ వల్ల అనేక మంది కార్మికులు గాయాలపాలై మరణించడం జరిగిందన్నారు. ఈ సంఘటనను మైనింగ్ యాజమాన్యం బయటికి రానికుండా ఎప్పటికప్పుడు కప్పిపుచ్చుకుంటున్నారని తెలిపారు. అక్రమ మైనింగ్ మాఫియాగా ఏర్పడిన కొందరు రాజకీయ నాయకులు గత ప్రభుత్వంలోనూ తమదైన శైలిలో చక్రం తిప్పుతూ కోట్ల రూపాయల సంపాదించుకొని అదే మైనింగ్ మాఫియా ప్రస్తుత ప్రభుత్వంలో చేరి అధికారులు బెదిరిస్తూ డబ్బుతో లొంగ తీసుకుంటూ అక్రమ మైనింగ్ దందాను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్యావరణం దెబ్బ తినే పరిస్థితి ఉందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి ఈ అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్టు వేయాలని కోరారు. ఈ సమావేశంలో అక్రమ మైనింగ్ వ్యతిరేక పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు పి.శ్రీనివాసులు రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, శివకుమార్, పాల్ రాజ్, షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీ పిజిఆర్ఎస్‌కు 98 ఫిర్యాదులు





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా వ్యాప్తంగా 98 ఫిర్యాదులు అందా యి. అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య ఫిర్యాదు దారుల నుంచి వినతులు స్వీకరించి, ఫిర్యాదు దారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారుల ను ఆమె ఆదేశించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ సిహెచ్. రామారావు, డీటీసీ సీఐ ఎం.నాగేశ్వరమ్మ, లీగల్ అడ్వైజర్ టీ.శ్రీనివా సులు రెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

▶▶కొడవలూరు పరిధికి చెందిన మహిళను నం ద్యాలకు చెందిన కటారి రమేష్ అనే వ్యక్తి ప్రేమి స్తున్నానని నమ్మించి శారీరకంగా కలిసి ఉన్నట్లు, పెళ్లికి నిరాకరిస్తూ వేరొకరితో పెళ్లికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు, మోసపోయానని, విచారించి న్యాయం చేయాలని, అదేవిధంగా ఉదయగిరి పరిధికి చెందినటువంటి మహిళను వింజమూరు పరిధికి చెందిన హరేంద్రబాబు అనే వ్యక్తి ప్రేమి స్తున్నానని నమ్మించి కలిసి సహజీవనం చేసిన ట్లు, పెళ్లి చేసుకోకుండా మోసం చేస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు.

▶▶తమిళనాడుకు చెందినటువంటి మహిళ, నెల్లూరు టౌన్ పరిధికి చెందినటువంటి పృథ్వీ రాజ్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకున్నట్లు, అతను ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్నట్లు, అధిక కట్నం కోసం వేధిస్తూ, చెడు అలవాట్లకు లోనై దాడి చేస్తున్నట్లు, ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు అలాగే వెంకటాచలసత్రం పరిధికి చెందినటు వంటి మహిళను, తన భర్త చెన్నైలో పనిచేస్తున్న ట్లు, తనకు ఇద్దరు ఆడపిల్లలని, తనని తన పిల్ల ల్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నట్లు, చెన్నై లో మరో వివాహం చేసుకున్నట్లు ఫోటోలు పంపి నట్లు, విచారించి న్యాయం చేయాలని, కౌన్సిలింగ్‌తో కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు.

▶▶అనంతసాగరం పరిధికి చెందిన వ్యక్తిని అదే గ్రామానికి చెందిన పొంతల తులసీధర్ అనే వ్యక్తి కువైట్‌లో మంచి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, మూడు లక్షల రూపాయలు నగదు తీసుకొని, కువైట్‌కి తీసుకెళ్లి అక్కడ హకామా ఇప్పించ కుండా ఒక రూమ్‌లో బంధించినట్లు, కువైట్ పోలీసులు అరెస్ట్ చేసి ఐదు రోజులు జైల్లో పెట్టి తర్వాత తిరిగి దేశానికి పంపించినట్లు, తులసీదర్ తనకు జాబ్ ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని, అడిగితే చంపుతానని బెదిరిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు.

▶▶కొండాపురం పరిధికి చెందినటువంటి మహిళ యొక్క భర్త మరణించినట్లు, అత్తింటి వారు తన భర్త తరపు ఆస్తి ఇవ్వకుండా వేధిస్తున్నట్లు, జీవనాధారానికి కూడా అవస్థలు పడుతున్నట్లు విచారించి న్యాయం చేయాలని కోరారు.

▶▶లింగసముద్రం పరిధికి చెందిన మహిళ యొక్క కుమార్తె 2.8.2025 నుండి కనిపించడం లేదని, అదే మండలానికి చెందిన దత్తాత్రేయ అనే వ్యక్తి మీద అనుమానం ఉన్నట్లు, విచారించి, తన కుమార్తె ఆచూకీ కనుక్కొని అప్పగించాలని కోరారు.

▶▶నెల్లూరు రూరల్ పరిధికి చెందిన వృద్ధురాలిని, తనకి ముగ్గురు పిల్లలు ఉన్నట్లు,తతమ్ము ఆస్థులు పంచాలని కొడుకులు కోడలు వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు విచారించి న్యాయం చేయాలని కోరారు.

సూర్య



విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9000483583

## నిర్దిష్ట గడువులోపు..పరిష్కారాలను అందించండి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లనుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుకున్న స్థానిక సమస్యలకు నిర్దేశించిన గడువులోపు పరిష్కారం అందించాలని అధికారులను కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. టిడ్కో గృహాల లబ్ధిదారులు చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అదేవిధంగా ఇంకా పూర్తికాని నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు కేటాయించనున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విభాగాల వారీగా ఇంజనీరింగ్-9, హౌసింగ్-8, టౌన్ ప్లానింగ్-10, రెవెన్యూ-2, పబ్లిక్ హెల్త్-3, అప్కాస్-1, మొత్తం-33 ఫిర్యాదులను అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖధికారి డాక్టర్ కనకాద్రి, సెక్రటరీ శ్రీలక్ష్మి, టీపీఆర్ఓ వాసు బాబు, ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరెంటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్న మరో టిప్పర్



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులో హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఇసుకలోడుతో వస్తూన్న టిప్పర్ అదుపుతప్పి ఆగి ఉన్న మరో టిప్పర్‌ను ఢీకొనడంతో, మెకానిక్ షాప్‌లోకి టిప్పర్ దూసుకెళ్ళింది. రెండు టిప్పర్‌లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్లకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ప్రమాద సమయంలో షాపులో ఎవరు లేకపోవడంతో ఎటువంటి ప్రాణానష్టం జరగలేదు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.